క్లుప్తంగా

4న రక్తదాన శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ భాస్కరరావు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కాకి కుంచారావు జ్ఞాపకార్థం ఈ నెల 4వ తేదీన రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు. శిబిరం పోస్టర్‌ను గాజువాక పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎల్.భాస్కరరావు, ఎస్ఐ కొల్లి సతీష్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒకరి రక్తదానంతో ఇద్దరి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి, ప్రాణదాతలుగా మారాలని కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకులు గొందేశి ప్రసాద్‌రెడ్డి, కాకి రామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి గౌరీ పరమేశ్వరుల ప్రతిష్టా మహోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల 16వ వార్షికోత్సవాన్ని ఈ నెల 11వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ తెలిపారు. 69వ వార్డు నాతయ్యపాలెం సీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఉత్సవాల పోస్టర్‌ను గురువారం కల్యాణమండపం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కాళ్ల రాజబాబు, ప్రతినిధులు ఎస్.అప్పలనాయుడు, కె.రమణ, ఆర్.మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లతో ఎంవీఆర్ విద్యార్థులు

గాజువాక: ఆంధ్రా యూనివర్సిటీ యోగా విలేజ్‌లో ఇటీవల నిర్వహించిన నార్త్ కోస్టల్ జిల్లాల యోగా పోటీల్లో స్థానిక ఎంవీఆర్ కాలేజీకి చెందిన యోగా విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారు. వివిధ విభాగాల్లో పాల్గొన్న విద్యార్థులు పలు పతకాలను సాధించినట్టు కళాశాల కరస్పాండెంట్ రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు.

ఎర్రన్నాయుడికి నివాళి

పెదగంట్యాడ: మాజీ ఎంపీ కింజరాపు ఎర్రన్నాయుడి సేవలు మరువలేమని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. వార్డు పరిధిలోని నెల్లిముక్కులో ఎర్రన్నాయుడి వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, నమ్మి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిషేధంపై పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ నిషేధం, పర్యవసానాలు, చట్టాలపై అవగాహన కల్పించేలా తీర్చిదిద్దిన ప్రత్యేక పోస్టర్లను ఏయూ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నారు. వర్సిటీలోని వివిధ ప్రధాన కూడళ్ల వద్ద కూడా ర్యాగింగ్ నిషేధంపై ప్రత్యేక బోర్డులు తయారు చేసి ఏర్పాటు చేశారు.

చూడచక్కగా రహదారులు

- ఆటోనగర్ ఏ బ్లాక్‌లో సుందరీకరణ పనులు
- రోడ్డుకు ఇరువైపులా గ్రీన్‌బెల్ట్
- గోడలపై ఆకట్టుకుంటున్న చిత్రాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



ఆటోనగర్ ఏ-బ్లాక్‌లోని విశాలమైన రోడ్డు



రోడ్డుకు పక్కనున్న గోడలపై ఆకట్టుకునే రీతిలో చిత్రాలు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఏ బ్లాక్ చూడచక్కగా దర్శనమిస్తోంది. విశాలమైన రహదారులు, పక్కనే గ్రీన్ బెల్ట్, గోడలపై ఆకట్టుకునే చిత్రాలతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఆటోనగర్‌లో ఐలా చేపడుతున్న అభివృద్ధి పనులతో బ్లాకుల రూపురేఖలు మారిపోయాయి. పలు బ్లాకుల్లో రహదారుల నిర్మాణం పూర్తయిందని, మరికొన్ని చోట్ల త్వరలోనే చేపట్టనున్నామని ఐలా కమిషనర్ జయచంద్ర, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి తెలిపారు.

పారిశ్రామిక ప్రాంతమైన విశాఖ నగరంలోని గాజువాక ఆటోనగర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆటోనగర్ ఏ, బీ, సీ, డీ, డీ-ఎక్స్‌టెన్షన్, ఈ, ఈ-ఎక్స్‌టెన్షన్, ఎఫ్ .. అపెరల్ పార్క్ బ్లాకులున్నాయి. ప్రతీ బ్లాక్‌లలో 50కు పైగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఇవి చాలా వరకు ఇండస్ట్రియల్ పార్కులుగా రూపుదిద్దుకున్నాయి. పరిశ్రమల చుట్టూ ప్రహరీ, లోపల పచ్చని చెట్లు, డ్రైనేజ్ వ్యవస్థలతో.. కాలుష్యాన్ని సాధ్యమైనంత వరకు అరికట్టే విధంగా ఉన్నాయి. రాకపోకలకు వీలుగా విశాలమైన రహదారులను నిర్మించి, అభివృద్ధి చేశారు.



ట్రీ గార్డుల్లో ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు

ఏ బ్లాక్‌లో సుందరీకరణ పనులు

ఆటోనగర్ ఏ - బ్లాక్ ప్రత్యేకతను చాటుకుంటోంది. భెల్ సిగ్నల్ పాయింట్ నుంచి మింది గ్రామం వైపు వెళ్లే ఏ- బ్లాక్ రోడ్డు విశాలంగా వాహనాల రాకపోకలకు ఎంతో అనువుగా నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. రోడ్డుకు ఇరువైపులా గ్రీన్ బెల్టును ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ఇప్పటికే పలు రకాల మొక్కలను ఏర్పాటు చేయగా.. మరిన్ని మొక్కలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇక గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు కనువిందు చేస్తున్నాయి. విశాలమైన మార్గం, పచ్చని మొక్కలతో ఆహ్లాదకర వాతావరణంలో ప్రయాణంపై వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ వెలుగుల మధ్య మరింత శోభాయమానంగా కనిపిస్తోందని చెబుతున్నారు.

ఐలా నిధులతో ఏ-బ్లాక్ అభివృద్ధి



ఆటోనగర్ ఏ - బ్లాక్‌ను ఐలా నిధుల నుంచి సుమారు రూ.1.50 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశాం. విశాలమైన రోడ్ల నిర్మాణం చేపట్టాం. రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం పెంపునకు ప్రణాళిక రూపొందించి, పనులు చేయిస్తున్నాం. ఇరువైపులా ఎల్‌ఈడీ కాంతులతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఆటోనగర్‌లో ప్రతీ బ్లాక్‌లో రోడ్ల విస్తరణతో పాటు కొత్త రోడ్లు, లైట్లు వంటివి ఏర్పాటు చేస్తున్నాం.
-కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), ఐలా చైర్మన్

ఖోఖో క్రీడాకారులకు సర్టిఫికెట్ల అందజేత



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దేవన్ రెడ్డి, అనూష

అక్కిరెడ్డిపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని హేమలత, 8వ తరగతి విద్యార్థిని ఆర్.ఢిల్లీశ్వరిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అభినందించారు. వారికి కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్‌తో కలిసి గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. అండర్-19 రాష్ట్రస్థాయి పోటీలు చిత్తూరు జిల్లాలో, అండర్-17 పోటీలు తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించనున్నట్లు పీడీ మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. వారితో పాటు మండలస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు దేవన్‌రెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, జెడ్పీ పి.సింహాచలం, పీఎంసీ కమిటీ చైర్మన్ సత్యారావు, వైస్ చైర్మన్ సుభాషిణి, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సలహా కేంద్రం ప్రారంభం



న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

అగనంపూడి: అగనంపూడి పరిధిలో ఉచిత న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల వివిధ కారణాల వల్ల న్యాయస్థానాన్ని ఆశ్రయించాలనుకునే పేదలకు ఆర్థిక భారం తప్పుతుందని దువ్వాడ రైల్వే స్టేషన్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు అన్నారు. అగనంపూడిలో న్యాయవాది ఎ.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, ఎల్.వి.రమణ, బి.సూరి, ఎం.వి.రమణ, జి.గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని పక్కకు జరపాలని వినతి



ఏఈకి సమస్యను వివరిస్తున్న వాసు

గాజువాక: చినగంట్యాడ నుయ్యి వీధిలోని రోడ్డు మధ్యలో గల విద్యుత్ స్తంభాన్ని పక్కకు జరపాలని 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ విద్యుత్ ఏఈ రామకృష్ణను కోరారు. ఈ మేరకు ఆ స్తంభాన్ని ఏఈకి చూపించి, సమస్యను వివరించారు. రోడ్డు మధ్యలో స్తంభం ఉండటం వల్ల అటు వైపుగా రాకపోకలు సాగిస్తున్నవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒకే విద్యుత్ స్తంభానికి అత్యధిక విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, వాటిని కూడా మరో స్తంభంపైకి సర్దాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ జానకమ్మ, గృహసారథి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలి



స్టీల్‌ప్లాంట్ సీజీఎం స్వామితో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. జిందాల్ గో బ్యాక్ అంటూ నినదించారు. జీతాల చెల్లింపులో జాప్యం, బీఎఫ్-3 నిర్వహణ జిందాల్ అప్పగింత ప్రతిపాదనకు నిరసనగా యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఉక్కు డెడికేషన్ పార్కు వద్ద ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం కార్మికులకు నెలాఖరున జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగిస్తుండగా.. స్థానిక యాజమాన్యం బీఎఫ్-3ను జిందాల్‌కు అప్పగించాలని కుట్ర చేస్తోందన్నారు. ఈ పరిస్థితులను తమ యూనియన్ ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోదన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఎస్.వి. స్వామిని కలిసి తమ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: పోస్టాఫీసుల్లో అమలు చేస్తున్న పథకాల గురించి ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. వార్డు పరిధి వికాస్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ ప్రసాదరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పోస్టాఫీసుల్లో పొదుపు పథకాలు ఉన్నాయని, అలాగే ఆడపిల్లల కోసం సుకన్య యోజన పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం పోస్టాఫీసుల్లో అమలు చేస్తున్న పథకాలను వివరించే కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెంటకోట నాగేశ్వరరావు, సమ్మిడి ఆనంద్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీపీ తరగతులు ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ గురువారం ప్రారంభించారు. ఇంజినీరింగ్ కళాశాలలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఐడియా జనరేషన్ మెథడ్స్ అంశంపై మూడు రోజుల పాటు ఈ తరగతులు జరగనున్నాయి. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు అధ్యాపకుల సామర్థ్యాలను పెంపొందించడానికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఏయూ అనుబంధ కళాశాలలకు చెందిన 170 మంది అధ్యాపకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దినకర్‌రెడ్డి, రీజినల్ మేనేజర్ బి.ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి షెకావత్‌కు సత్కారం



కేంద్ర మంత్రి షెకావత్‌ను సత్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: కేంద్ర జలశక్తి శాఖామంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను గాజువాక బీజేపీ నాయకులు సత్కరించారు. విశాఖలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు హాజరైన ఆయన తన కార్యక్రమంలో భాగంగా నగరంలోని బీజేపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గాజువాక కన్వీనర్ ఆధ్వర్యంలో నాయకులు షెకావత్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పి.నాగేశ్వరరావు, సేనాపతి మహేష్, గీతా సంగ్, వంశీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ పలకరింపు



విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మధురవాడ ఐటీ హిల్ - 3 హెలీప్యాడ్ వద్ద ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సీఎం ఆత్మీయంగా పలకరించారు. - విశాఖపట్నం

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కల ఆవశ్యకతను వివరిస్తున్న దువ్వాడ సీఐ శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: ఆరోగ్యకర వాతావరణం, ఆహ్లాదకర పరిసరాల కోసం ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టుపక్కల మొక్కలు నాటాలని దువ్వాడ సీఐ శ్రీనివాసరావు సూచించారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ సంస్థ ఆధ్వర్యంలో దువ్వాడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కల ఆవశ్యకతపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ సంస్థ తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా తులసి, సీతాఫలం, జామ, వేప మొక్కలను పంపిణీ చేశారు. సంస్థ అడ్మిన్ మాచవరపు ఐశ్వర్య, సునంద, జ్యోతి, అమర్‌బాబు, ఏబీఎల్ఎన్ఎస్ నాయుడు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మేధావి వర్గం మౌనం వీడాలి



994వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశంలోని మేధావి వర్గం మౌనం వీడి ప్రశ్నించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. అప్పుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో 994వ రోజు, గురువారం సంస్థకు చెందిన ఆర్ఎంపీ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమంపై ప్రభుత్వ అణచివేత పెరుగుతున్న కొద్దీ, ప్రజలలో వ్యతిరేకత పెరిగి బీజేపీ రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉక్కు ఉద్యమంలో ప్రజలను మరింత మమేకం చేసే విధంగా ఉద్యమాలపై అవగాహన కలిగిస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థి

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి కె. వరభాస్కర నాయుడు మహారాష్ట్రలో జరగబోయే సీనియర్ లెవల్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ గురువారం తెలిపారు. ఈ జాతీయ స్థాయి పోటీలు ఈ నెల 14నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు చెప్పారు. తమ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న వరభాస్కరనాయుడు గత నెల 8,9వ తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

- ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా బృహత్తర కార్యక్రమాలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి వెల్లడి
- 68వ వార్డులో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం ప్రారంభం



68వ వార్డులోని శిబిరంలో మహిళకు మందులు అందిస్తున్న దేవన్ రెడ్డి, కార్పొరేటర్ అనూష



68వ వార్డులోని శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



మహిళకు మందులు అందజేసి, వాడే విధానం తెలియజేస్తున్న వైద్యులు



శిబిరంలో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది



65వ వార్డు గిరిజాకాలనీలో రోగిని పరీక్షిస్తున్న యూపీహెచ్‌సీ వైద్యాధికారి వరలక్ష్మి

అక్కిరెడ్డిపాలెం: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగానికి ఎంతో ప్రాధాన్యం కల్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పార్టీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం సచివాలయ పరిధి రామాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ గుడివాడ అనూషతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం సంపన్నులకు మాత్రమే చేరువై, పేదలకు అందని ద్రాక్షలా మారిన తరుణంలో.. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించి, వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారన్నారు. యూపీహెచ్‌సీల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఉన్నతస్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సిబ్బంది ప్రతీ ఇంటిని జల్లెడ పట్టి, అందరికీ ఇంటివద్దనే బీపీ, షుగర్, రక్తపరీక్షలు చేసి.. అవసరమైన వారికి మెరుగైన వైద్యం టోకెన్లు అందించి, శిబిరాలకు హాజరు కావాలని సూచిస్తున్నారన్నారు. శిబిరాల్లో స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షించి, నెలకు సరిపడా మందులు అందజేస్తున్నారని, అవసరమైన వారిని వేరే ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని తెలిపారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

421 మందికి వైద్య సేవలు

శిబిరంలో వైద్యులు 421 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. రాంనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎ.ప్రియాంక, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.మానస, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ ఎల్.మహాలక్ష్మి, సర్జన్ డాక్టర్ టి.పుష్పలత, కంటి వైద్యనిపుణురాలు డాక్టర్ ధనలక్ష్మి, డెంటిస్ట్ డాక్టర్ దీప్తి శిబిరంలో వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు వరదాడ వెంకటరమణ, సంగ్రాన నూకరాజు, నంబారు రాజు, తెంటు గోపాలరావు, నేలపాటి సత్యవతి, సయ్యద్ హుస్సేన్, వార్డు సచివాలయ సెక్రటరీలు, సచివాలయాల ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజాకాలనీ యూపీహెచ్‌సీలో 503 మందికి..

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డులోని గిరిజా కాలనీ యూపీహెచ్‌సీలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన శిబిరాల్లో అధికసంఖ్యలో ప్రజలు పాల్గొని, సేవలు పొందుతున్నారన్నారు. 503 మందికి 6గురు వైద్యులు సేవలు అందించారు. స్థానిక యూపీహెచ్‌సీ వైద్యాధికారి వరలక్ష్మి, గంగవరం యూపీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌కుమార్, దంత వైద్యురాలు డాక్టర్ స్నేహ, నేత్ర వైద్యురాలు డాక్టర్ కిన్నెర, మైక్రోబయోలజిస్ట్ డాక్టర్ ప్రసూన యాదవ్, ఎముకల వైద్యులు డాక్టర్ సయ్యద్ అజ్మల్ పాల్గొని, రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచనల మేరకు సిబ్బంది అవసరమైన వారికి రక్తపరీక్షలు, ఇతర పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో జోన్-6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం, కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, మండల క్లస్టర్ అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో నిర్వహిస్తున్న 30వ జాతీయ లిక్విడ్ క్రిస్టల్స్ జాతీయ సదస్సును ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ప్రారంభించారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు సదస్సు కొనసాగుతుంది.ఆమె మాట్లాడుతూ ఏయూ భౌతిక శాస్త్ర విభాగం సర్ సీవీ రామన్ నుంచి స్ఫూర్తిని పొందిందని, తరువాత కాలంలో ఆయన శిష్యులు ఆచార్య సూరి భగవంతం బలమైన పునాదులు నిర్మించారన్నారు. నేడు భారత్ అణుశక్తి, అంతరిక్ష, ఐవోటీ రంగాలలో అద్వితీయ ప్రగతిని సాధిస్తోందన్నారు. ఎల్‌సీడీల ఆవిష్కరణ తదనంతర మార్పులు వివరించారు. మూడు రోజుల సదస్సును పరిశోధకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్ఆర్ఐ ఎమిరిటస్ ప్రొఫెసర్ కేఏ సురేష్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఏయూలో లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఈ రంగంలో పీసీ పతి చేసిన పరిశోధనలు, కృషిని వివరించారు. ఇండియన్ లిక్విడ్ క్రిస్టల్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య రవీంద్రధర్ మాట్లాడుతూ లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు దేశ వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా అందించే పలు అవార్డులను ప్రకటించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ ఆచార్య కె.బసవయ్య, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.రామకృష్ణ నాంచారరావు ప్రసంగించారు. సదస్సులో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన పరిశోధకులు, ఆచార్యులు పాల్గొన్నారు.